# ప్రాణం కాపాడిన పనివాడిని ప్రతిఫలంగా యజమాని శిక్షించాడెందుకని?

**కె.బి.ఎస్. కుమార్ కథ**

# దయయు, సత్యంబు 'లోను'గా..

రామిగాడు పరిగెడుతున్నాడు.

ఆకాశం వాడిపట్ల జాలికనబర్చడం లేదు. ఒక్క మేఘమైనా వాడి కోసం చేరువకి లాక్కుని సూర్యుణ్ని దాని వెనక దాచి పెట్టడం లేదు.

రామిగాడు పరిగెడుతున్నాడు.

సూర్యుడు వాడిపట్ల జాలి కనబర్చడం లేదు. తన తీక్షణ కిరణాలని ప్రకృతిపై ప్రసరింపజేస్తూనే ఉన్నాడు.

రామిగాడు పరుగెడుతున్నాడు.

ఒక్క మేఘమూ వాడిపట్ల జాలి కనబర్చడం లేదు. వాడి దీనావస్థకి చల్లబడి బిందువులుగా చెల్లా చెదరై భువిని చేరటం లేదు.

రామిగాడు పరిగెడుతున్నాడు.

వాయుదేవుడు వాడిపట్ల జాలి కనబర్చడం లేదు. ప్రళయ ఝుంఝామారుతమై వీస్తూ వాడి వేగానికి చేయూత నిస్తూ వాడికి శ్రమ తగ్గించే ప్రయత్నం చేయడం లేదు.

రామిగాడు పరిగెడుతున్నాడు.

భూదేవి వాడిపట్ల జాలి కనబర్చడం లేదు. పరిగెడుతూ అస్తవ్యస్తంగా తనపై వేస్తోన్న పాదాలకు కురుపు లూ పులిపిరులకి మల్లే తనపై వున్న రాళ్ళూ రప్పలూ ముళ్ళ పొదల్నీ తనలోకి లాక్కోవటం లేదు.

ఆకాశం.

గాలి.

సూర్యుడు.

నీరు.

భూమి.



ఇవి పంచ భూతాలు. సర్వ మానవ కోటినీ పరిరక్షిస్తూ యావత్ సృష్టినీ సస్యశ్యామలం చేయాలన్న దీక్షతో డ్యూటీ చేస్తోన్న భగవదంశాలు. వాటికి ప్రత్యేకంగా రామిగాడొక్కడి పైనే జాలి వుండాల్సిన అవసరం లేదు.

కాని వీళ్ళకేమైంది?

వీళ్ళు పంచభూతాలు కారే!

ఓహో పంచ 'భూతాలు' కాబోలు!!!

* * *

రామిగాడు పరిగెడ్తూనే ఉన్నాడు.

వాళ్ళు తరుముతూనే వున్నారు.

రామిగాడి నల్లని శరీరం చెమటకి తడిసి ఎండ ప్రతిఫలిస్తూ తళతళ మెరిసిపోతోంది.

కష్టపడి నాలుగు రాళ్ళు సంపాదించుకోవడం కోసం తిరిగే ప్రయత్నంలో వెలువడాల్సిన పవిత్రమైన ఆ స్వేద జలం అనవసరంగా అలా ప్రవిస్తోంటే స్వేద గ్రంధులు సైతం వాడి దీనావస్థ చూసి కంటతడి పెడుతున్నవా అన్పిస్తోంది.

కూలి పనులు చేస్తూ తట్ట గంపలు మోస్తూనో మరేదైనా మోస్తూనో అటూ ఇటూ తిరిగి వెప్పెట్టాల్సిన వాడి కాళ్ళు అనవసరంగా అలా పరిగెడుతోంటే వాడిపిక్కల మీద రోమాలు సైతం నిక్కబొడుచుకుని ఆ దారుణాన్ని గుడ్లప్పగించి చూస్తున్నాయా అన్పిస్తోంది.

తరుముతూన్న వాళ్ళకి ఆయాసం వచ్చేస్తోంది. గుండె దడ వచ్చేస్తోంది. అలసట వచ్చేస్తోంది. గొంతు పిడచ గట్టుకు పోతోంది. కూడబలుక్కున్నట్టుగా అందరూ ఒక్కసారే ఆగిపోయారు.

"బతికిపోయాడు ఎదవ నాయాలు" ఒకడన్నాడు.

"దొరికపోయుంటే బతికి పోయేవాడేనా?" ఇంకోడన్నాడు.

"పదండ్రి పోదాం..." మరొకడన్నాడు.

"అమ్మో! గూడెం దాకా ఎంటబడమన్నాడు దొర. ఇట్నించి ఇటే ఎనక్కు పోతే మన్ని పాతరెయ్యడూ!" వాళ్ళోవాడన్నాడు.

"నోర్మూయ్ హె! సగం దూరానికి పైగానే తరుముకొచ్చేశాం. దొరగారు చూడొచ్చారా యేమిటి? ఆ బావి కాడ కొంచేపే కూకుని గూడెం దాకా తరిమేశామని చిక్కలేదు గాబట్టి దెబ్బ కొట్టలేదనీ చెప్పేద్దాం. పదండి" అయిదో వాడన్నాడు.

"జాగర్త. ఎవుర్నడిగినా ఇదే మాట జెప్పాల. మాట మారిందో తాట వదిలి పోద్ది" ఆరోవాడు హెచ్చరించాడు.

అందరూ అక్కడికి కాస్త దూరంలో బావి దగ్గర మర్రిచెట్టు నీడలో కూర్చున్నారు. చేదతో నీళ్ళు తోడుకుని చల్లని నీళ్ళు మొహాల మీద పోసుకున్నారు. కడుపునిండా నీళ్ళు తాగారు. అరగంట సేపు సేద తీర్చుకుని ఈ వార్తని వాళ్ళ పెద్ద దొరగారికి విన్నవించటం కోసం వెళ్ళిపోయారు.

* * *

పద్మినీ కాంతుని ప్రచండ కిరణాల ధాటికి ప్రకృతి వణికి పోతోంది.

రామిగాడు ఆయాసంతో రొప్పుతున్నాడు. నడిచే శక్తికూడ లేక గూడేనికి అరఫర్లాంగు దూరంలో వున్న ఓ మర్రి చెట్టునీడలో చతికిల బడ్డాడు.

కాళ్ళు పీకుతున్నాయి. ఒళ్ళు చల్లబడిపోయింది. కళ్ళముందు శూన్యం తప్ప మరేమీ కన్పించటం లేదు. నాలిక పిడచ గట్టుకు పోతోంది. నిలబడే శక్తి కూడా సన్నగిల్లి పోయింది వాడికి. వీపూ గుండెలూ

పొట్టా బొబ్బలు కట్టి ఎర్రగా కంది చిమచిమ లాడుతున్నాయి.

పదడుగులువేస్తే గూడెం వస్తుంది. మరో పదడుగులు అంతే. కొంపే వచ్చేస్తుంది.

కాని శక్యం గావటం లేదు.

నాలిక పెదాలు తడుపుకున్నాడు రామిగాడు. నాలిక మీద తడివుంటేగా పెదాలు తడవడానికి.

ఎండిపోయిన గొంతు నాళాన్ని వెంట వెంటనే గుటకలు మింగి తడుపుకోసాగాడు రామిగాడు.

ప్రక్కనే బురద గుంటలో పైకి తేరిన నీళ్ళ గతికి రామిగాడికేసి జాలిగా చూసిందో గజ్జికుక్క.

నెమ్మదిగా లేచాడు రామిగాడు. ప్రాణభయమంటే ఇదేకాబోలు. మనుషులు తరుముతూన్నంత సేపూ వాడికి అలుపు నెప్పీ వగైరా లేవీ తెలీలేదు. గండం కస్తా గడిచేసరికి ఎక్కడలేని నీరసమూ ఆవహించింది.

నీరసంగా అడుగులు వేస్తున్నాడు. పిక్కలు సలుపుతున్నాయేమో కాస్త కుంటుతున్నాడు.

కాని వాడు మరో గడ్డు పరిస్థితి వెదుర్కోవాల్సి వుందని ఆ క్షణంలో వాడికి తెలీదు.

* * *


ధబాలున తలుపేసుకున్నాడు బోకే నాయక్.

విస్తుపోయాడు రామిగాడు. వాడికి కళ్ళమ్మట నీళ్ళు చిప్పిల్లాయి.

తనే మడిగిందు గుక్కెడు నీళ్ళడిగిందు "మంటిముంతలో నీళ్ళు పోసియ్యి నాయకన్నా గొంతెండి పోతోన్నాది" అని మరియాదగానే అడిగిందు.

ఇప్పుడే గాదు ఇట్టా ఎన్నోసార్లడిగిందు. తనే గాదు. మామూలుగా వూరిలోనుండి గూడేనికి ఎవురొచ్చినా నాయకన్న ఇంటికాడికొచ్చి మంటి ముంతలో నీళ్ళిప్పించుకుని తాగి రెండు నిమిషాలు కూచ్చుని వెళ్ళిపోవాల్సిందే. ఎందుకంటే నాయకన్న ఇంటి కాణ్నుంచి గూడెం మొదలవుతుంది.

## ప్రకటన



ఒక కంపెనీ వాళ్లు టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగి పేపర్లో ప్రకటన ఇచ్చాడు.

"అందమయిన టెలిఫోన్ ఆపరేటర్ కావాలి. అర్హతలున్నవారు 660067 నెంబరుకి ఫోన్ చెయ్యండి. టెలిఫోన్ ఎవరూ ఎత్తకపోతే ఉద్యోగం ఇంకా ఖాళీగా వుందని భావించి వెంటనే రండి" అని.

—కె.వెంకటరామ అక్కయ్య
(కంకిపాడు)

తనకెన్నోసార్లిచ్చింది. ఎందరికో ఎన్నో సార్లిచ్చింది. ఇప్పుడు తన మొగం మీదే వాకిలేసుకుంది.

గుక్కెడు నీళ్ళు కరువైనాయా?

ఎందుకిట్టా జేసింది నాయకన్నా!!!

ఎంతాలోచించినా అర్థం కాలేదు రామిగాడికి.

నీరసంగా ముందుకు సాగాడు.

బోకే నాయక్ ఇవ్వకపోతేనేం. మంగే నాయక్ వున్నాడు. చింతానాయక్ వున్నాడు. లక్మేనాయక్ వున్నాడు. ఇంకాస్త ముందుకు వెడితే వాడి కులం వాళ్ళయిన మూగెన్న, చిన్నస్వామి, కృపానందం, ఏసయ్య, మునిస్వామి వీళ్ళందరూ వున్నారు. ఓపిక అరువు తెచ్చుకు కాస్త ముందుకి వెళ్ళాలే గాని సాక్షాత్తూ రామిగాడి పెళ్లామైన సుంకులమ్మే వుంది.

అయినా ఓపికని అరువు తెచ్చుకునే ఓపిక్కూడా కరువైంది వాడికి. నాలిక తడారి పోతుంది. కడుపు లో మంట మొదలై చెయ్యి పెట్టి తిప్పుతున్నట్టుంది. ముక్కు రంధ్రాల్లోంచి వెచ్చని ఆవిర్లు వెలువడుతున్నాయి. కళ్ళు మండుతున్నాయి.

సూర్యకిరణాలు సూటిగా కళ్ళలో పడుతోంటే చెయ్యడ్డం పెట్టి పరిసరాల్ని తేరిపారచూశాడు రామిగాడు. ఎవరింటికి ముందర వాళ్ళు వాళ్ళ వాళ్ళ భార్యల్తో పెద్దల్తో పిల్లల్తో నిలుచుని వున్నారు. అయితే వాళ్ళందరి కళ్ళలో జాలి సానుభూతి లాంటి భావాలు కదలాడుతోన్న భావనలు దోబూచులాడుతున్నాయి. సినిమానో, తోలు బొమ్మలాటనో [illegible] చూస్తూన్న వాళ్లలా కాక నిద్యుద్ఘాతానికి గురై చచ్చిన సుగ్రావ్ని చూస్తూన్నప్పటి బాధ కదలాడుతోంది.

వాళ్లు మనుషులు.

వాళ్ళకు మనసుంది.

వాళ్లలో మానవత్వం వుంది.

స్పందన వుంది.

వాళ్ళ మనసుకు జాలిపడే స్వభావం వుంది.

కష్టాల్లో ఆదుకునే తత్వం వుంది.

కాని అవేవీ వాళ్ల ప్రదర్శించడానికి వీల్లేదు.

వీల్లేదన్నప్పుడు ఖచ్చితంగా వీల్లేదు.

అది రూలు.

దాన్నతిక్రమించిన వాళ్ళ వీపులపై రూళ్ల క్రూర రుద్రతాండవం చేస్తుంది.

అదేమని అడిగే నాథుడు లేడు.

కారణం వాళ్లు మనసు తప్ప డబ్బు లేని వాళ్లు.

గుణం తప్ప కులం లేని వాళ్ళు.

వాళ్ళకి నాథుడొక్కడే.

దొరగారు!

దొరగారి మాట వేదవాక్కు. అతని ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ.

సుగ్రీవుని కిచ్చిన మాట నిలబెట్టడం కోసం ఆనాడు వాలిని దొంగచాటుగా కొట్టాడు రాముడు. తన మాటకున్న పదునూ పరువూ నిలబెట్టుకోవడానికి ఎదటి మనిషినే ఎదురుగా నిలబెట్టి రెండుగా చీల్చడానిక్కూడా వెనుకాడడీ దొరగారు.

రాముడు పుట్టిన రాజ్యమిది.

రామరాజ్యమంటారు దీన్ని.

రాముడు పుట్టిన రాజ్యంలో రావణులున్నారు.

కర్ణుడు పుట్టిన రాజ్యంలో రావణులున్నారు.

కర్ణుడు పుట్టిన దేశంలో కటిక దరిద్రులున్నారు.

ఆనాడు రావణుడొక్కడే దశకంఠుడు. ఈ నాటి రావణులు సహస్రకంఠులు.

ఆనాడు రావణుడూ ఒక్కడే, రాముడూ ఒక్కడే.

కాని ఈ నాటి రావణుల్ని సమూలంగా పెకలించటానికి ఒక్క రాముడైనా లేడు.

అది రామరాజ్యం చేసుకున్న దురదృష్టం.

దొంగలు దొరలుగా చెలామణీ అవటం కొత్తేమీ కాదు. అలాగే దొంగలకు దొర అవి పేరుండటం కూడా వింతేమీ కాదు.

ఈ దొరగారి అసలు పేరు దొరస్వామి. వీళ్ళ పాలిట దొర స్వామి రెండూ తానే అయ్యాడు.

రెండేళ్ళ క్రితం గూడెం ప్రజలెవరో దొరస్వామి ఎవరో.

రెండేళ్ళ క్రితం అసలక్కడ లేదు గూడెం. ఈ బోకే నాయక్‌లా రామిగాళ్ళా అందరూ అక్కడెక్కడో వుండేవాళ్లు విడి విడిగా చెంచు వాళ్లు అధిక సంఖ్యలో వుండటంతో దాన్ని బండల మిట్ట తాండా అవి పిలిచే వారు. అది కాస్త వ్యవహారిక భాషలో బండెలమిట్ట తాండా అయింది. ముద్దుగా గూడెం అనీ ముద్ర పడిపోయింది దానికి.

ఒక నదికి సమీపంలో వుండేదది.

స్వచ్ఛమైన జీవితం గడుపుతూండేవారు వాళ్లు.

అయితే ఆ నది తరచూ పొంగుతూండటంవల్ల వరదలు వారి జీవితాన్ని సంపదల్ని కొరుక్కుతినేవి.

అయినా చలించక కొట్టుకుపోయినప్పుడల్లా నిరాశ్రయులవుతూ వరద భీభత్సం తగ్గగానే వెనక్కి పోయే కెరటంలా చల్లారి మళ్ళీ గుడిసెలుకప్పుకుంటూ జీవితాలు వెళ్ళబుచ్చేవారు.

## చిట్కా వైద్యం



తీవెటీగ కుడితే... ఆ ప్రదేశంలో ఉల్లిపాయచెక్కతో రుద్దండి. నొప్పి మటుమాయం అవుతుంది.

గొంతు నొప్పిగా ఉందా? ఒక కప్పు వేడి నీటిలో ఒక స్పూన్ తేనేవేసి కలిపి గొంతులో పోసుకొని పుక్కిలించి ఉమ్మివేయండి. మంచి ఫలితం ఉంటుంది.

విపరీతంగా దగ్గువస్తుందా? ఓ పది లవంగాలు నిప్పుల మీద కాల్చి పొడిచేసి తేనెలో కలిపి రోజుకు నాలుగైదు సార్లు తీసికోండి దగ్గు మీకు గుడ్‌బై చెప్పేస్తుంది.

జూపిటర్

వారి బాధ చూళ్లేక ప్రభుత్వం వారిని అక్కడి నుండి ఇక్కడికి తరలించింది. గవర్నమెంటు పోరంబోకు స్థలాన్ని వారి కోసం కేటాయించింది. చెట్లు నాటించింది. బోరింగులు వేయించింది.

దొరగారు నొసలు చిట్లించారు.

దొరగారి తమ్ముడు, బావమరిది మాజీ రెడ్డి, మాజీ కరణము దొరగారిని శాంతింపజేశారు.

"వుండనీవే బావా! వాళ్లు మనకి అడ్డమేమీ కారుగా!" అన్నాడు బావమరిది.

"ఒక రకంగా మనకు వాళ్లు అవసరం కూడాను" అన్నాడు తమ్ముడు.

"రోజుకి పది రూపాయల వంతున మన వూరి వాళ్లు మనకు కూలికొస్తున్నారు. అందులో సగం పారేస్తే చా లు. వీళ్లొస్తారు" అన్నాడు మాజీ రెడ్డి.

"రాకపోయినా దొరగార్లు రప్పించరూ" అన్నాడు మాజీ కరణం.

దొరస్వామి ఛాతీ ఉబ్బింది. మిగత నలుగురూ కల్సి మరికాస్త గాలి కొట్టారు. అయిదుగురూ కల్సి మాట్లాడారు. మంతనాలు జరిపారు.

వూరి బైట వున్న పది పది హేనుకుటుంబాలు కూడా గూడెంలో కలుపబడ్డాయి. వాళ్ళు హరిజనులు.

వాళ్ళుంటున్న స్థలం తాలూకు పొలం దొరగారిదేననీ ప్రభుత్వం వారడిగితే దానంగా ధారాదత్తం చేశారని చెట్లు నాటడం, బోర్లు వేయించడం వగైరాలన్నీ దొరగారే వేయించారనీ అందుక్కావలసిన ఖర్చులన్నీ దొరగారే భరించారనీ, గూడెం వాళ్ళంతా దొరగారికి రుణపడి వున్నారనీ రుణపడి వుండాలనీ ప్రచారం లేవదీయబడింది.

అమాయకులైన హరిజనులు గిరిజనులు దాన్ని నమ్మారు.

మాట విలువ తప్ప ఓటు విలువ తెలియని వాళ్లు.

మాట విని ఆచరించటమే తప్ప ఆలోచనలేని వాళ్లు.

చదువొచ్చిన వాడు ఒక్కడు కూడా లేని వాళ్లు.

వంగి వంగి దణ్నాలు పెట్టారు దొరగారికి.

దొరస్వామి మీసాలు మెలేశాడు. వాటిపై నిమ్మకాయలు నిలబెట్టుకుని గూడేన్నేలుతున్నాడు.

అందుకోసం చాల మంది అధికారులు అతడి జేబు తడిమారు.

అతడు వాళ్ళ జేబులు తడిపాడు.

నిరంకుశత్వం యధేచ్ఛగా రాజ్యమేలుతోంది అక్కడ.

ఆ నిరంకుశానికి ప్రతీకగా..

* * *

"రేయ్.. ఇలా రారా..." హుంకరించాడు దొరస్వామి.

"పిలిచ్చినా దొరా?" వొంగి వినయంగా చేతులు కట్టుకుని అడిగాడు రామిగాడు.

"బోకి వెధవ పన్లోకెందుకు రాలేదు?" దొరస్వామి కళ్లు నిప్పులువర్షిస్తున్నాయి.

"బోకే నాయకన్నానా దొరా!?" మరింత వినయం ఉట్టిపడింది రామిగాడి మాటల్లో.

"ఆ....!" మరింత మదం

ధ్వజమెత్తింది దొరస్వామి కళ్ళలో

"ఆడి పెళ్ళానికి పేణం బాగాలేద్దొరా!"

"బాగాలేకపోతే! అన్నంతింటంలేదా?"

"..."

"మాట్లాడవేం?"

"తత్ తత్ తింటన్నాడుదొరా!

"నీళ్ళు తాగటం లేదా?"

"తాగుతున్నాడు దొరా!"

"వూపిరి పీల్చుకోవటం లేదా?"

తలూపాడు రామిగాడు.

"ఏం?! మాట పడిపోయిందా?" క్రర పైకి లేచింది.

"పీల్చుకుంటున్నాడు దొరా!"

"మరి పన్లోకి రావటానికేంరా లంజకొడకా!"

బోకే నాయక్ పన్లోకి రాకపోతే తనవి తిట్టడం ఎందుకో అర్థం కాలేదు రామిగాడికి. అయోమయంగా మొహం పెట్టాడు.

దొరస్వామి ఏమో అనబోయేలోగా లోపల్నుండి కెవ్వున కేక విన్పించింది. అది దొరస్వామి ముద్దుల కూతురు వినయది.

ఒక్క ఉదుటన లేచి పరిగెత్తాడు దొరస్వామి. ఒక్క నిమిషంలో తిరిగొచ్చాడు. ఎంత గంభీరంగా వున్నా అందులో కంగారు కన్పిస్తూనే వుంది.


"రేయ్.. లోపల పామొచ్చిందట. అమ్మాయిగారు చూశారు. వెళ్ళి ఆ పని చూడు."

విలుచున్న పళంగా పరిగెత్తాడు రామిగాడు లోపలికి.

వంటింటికి కుడి భాగంలో వరసగా మూడు గాదెలున్నాయి. ఓ దాన్లో బియ్యం, ఓ దాన్లో జొన్నలు, మూడో దాన్లో గోధుమలు వున్నాయి. బియ్యం తీసుకోడానికి వినయ అక్కడికొచ్చింది.

గాదెల చుట్టూ ఎప్పుడూ ఎలుకలు తిరుగుతుంటాయి. అక్కడ కాస్త చీకటిగా వుంటుందనే చెప్పాలి.

ఎలకల కోసం ఎప్పుడొచ్చిందో మొదటి



రెండు గాదెల నడుమ మెలికలు తిరుగుతూ తచ్చాడుతోన్న పాము వినయ కంట బడింది.

"ఎక్కడ? అమ్మాయిగోరూ! పామెక్కడ??" హడావుడిగా అంటూ వెళ్ళాడు రామిగాడు.

చేష్టలు దక్కి విలుచుండిపోయిన వినయ అపంకల్పితంగా వేలు పెట్టి చూపించింది.

భుజమ్మీది మాసిన తువ్వాలు తీసి నడుముకి బిగుతుగా కట్టి రంగంలోకి దూకాడు రామిగాడు.

నెమ్మదిగా తేరుకుంది వినయ "అక్కడ కాదురా! ఇక్కడ ఇదిగో ఇక్కడే చూశాను. అబ్బ తోకే ఎంత పొడుగ్గా ఉందో."

"మీరు మాట్లాడకండమ్మాయిగోరూ! మనకనంటే ఎంత బయమో ఆటికీ మనమంటే అంతే. మీ అరుపినె దాక్కోమంటది." నెమ్మదిగా అంటూ డిటెక్టివ్‌లా శోధించడం మొదలుపెట్టాడు.

పాము తోక వాడికంట బడింది. నెమ్మదిగా అదిలించడం మొదలు పెట్టాడు.

పాముకీ దిక్కుతోచలేదు. కంట బడితే వెంట బడతారని దానికీ భయమే పాపం.

ఇక లాభం లేదనుకుని పక్కనే వున్న ముల్లుకర్ర తీసుకుని తోకపై ఒక్క చిన్న దెబ్బ వేశాడు ఏమైతే అదయ్యిందని.

అది నాగు పాము కాదు. వట్టి బెదురు గొడ్డులా వుంది. పారిపోయే ప్రయత్నంలో శరవేగంలో పక్కకి దూసుకొచ్చింది.

పాము తన వైపే రావటం గమనించిన వినయ మరో సారి గట్టిగా కేక వేసి బల్లిలా రామిగాడ్ని కర్చుకుపోయింది.

ఆమె వైపుగా పారిపోబోయిన పాము ఆమె కేక వేసి అక్కడి నుండి పరిగెత్తడంతో మరో దారి లేక ఎదురుగదిలోకి దారితీసింది.

అది వంటిల్లు.

వినయకేక విన్న దొరస్వామి పరుగున వచ్చి సరిగ్గా అప్పుడే ఆ దృశ్యం చూశాడు.

అతడి కళ్లలో నిప్పులు ప్రత్యక్షమయ్యాయి.

అతడి చేతిలోని కర్ర బలాన్ని పోసుకుంది.

అతడిలోని రక్తం కళ పెళ ఉడకసాగింది.

ముల్లు కర్ర తీసుకుని లోనికి జొరబడ్డాడు రామిగాడు. నది ప్రాంతంలో లోగడ కాపురమున్నప్పుడు ఇలాంటి సంఘటనలు వాడికి మామూలే. నదిలోంచి రకరకాల పాములు కొట్టుకొచ్చేవి. గట్టున పడి తలా ఒక దోవన సాగిపోయేవి. కడుపుకోసం ఇళ్ళలోకి జొరబడేవి.

ఒడుపుగా తోక పట్టుకుని గిరగిరా తిప్పి తల చితికిపోయేలా నేలకేసి కొట్టేవాడు రామిగాడు.

ఇప్పుడైనా ముల్లు కర్ర వాడికి పేరుకు మాత్రమే.

చెట్నీ జాడీల సందుకి తప్పుకుపోతున్న పాము తోకని లాఘవంగా పట్టుకున్నాడు రామిగాడు అంతే...

రెండు నిమిషాల్లో ఆ పాము విగతజీవి అయింది.

రక్తసిక్తమై వున్న పాము శవాన్ని చేత్తో పట్టుకుని వెలిగిపోతోన్న మొహంతో బైటకొచ్చాడు రామిగాడు. వాడి కళ్లు విజయ

గర్వంతో మెరుస్తున్నాయి. చక్రాల్లాంటి కళ్లని మరింత విప్పార్చి తనకేసి తన చేతిలోని పాముకేసీ తదేకంగా చూస్తోన్న వినయని వాడు చూళ్లేదు. పట్టించుకోలేదు. నేరుగా దొరకేసి నడిచాడు. తను పామునెలా పట్టాడో దాన్నెలా నేలకేసి కొట్టాడో వివరంగా దొరగారితో చెప్పాలని వాడి తాపత్రయం.

"దొరా!" అన్నాడు దగ్గరగా వెళ్ళి.

అంతే...

వాడి చెంప పేలిపోయింది.

* * *

"చెప్పు... వంటింట్లోకెందుకు వెళ్ళావ్?" గర్జించాడు దొరస్వామి.

రామిగాడి చేతులు వెనక్కి విరచబడి కట్టి వేయబడి వున్నాయి దొరస్వామి చేతి కర్రకి స్వేచ్ఛని కల్పిస్తూ.

"పాము వంటింట్లోకి వెళ్ళింది దొరా! అంచేత నేనూ వెళ్ళాను" అని చెప్పాలనుంది రామిగాడికి. కాని వాడు మాట్లాళ్లేదు.

"మాట్లాడవేంరా మాదిగ లంజకొడకా! మమ్మల్ని ఎద్దేవా చెయ్యడానిక్కాదూ! మమ్మల్ని అపవిత్రం చెయ్యడానిక్కాదూ! నేను పాముని చంపేంత గొప్పవాణ్ణి? ఓహో అని దండోరా వెయ్యడానిక్కాదు? మేమంతా చాతగాని వాళ్ళమని కాదూ!"

"పాము వంటింట్లోకి పోకపోయి వుంటే నాకా అవసరమే వుండేది కాదు. నేను మీ వంటింట్లో కొచ్చినంత మాత్రాన నాకొచ్చే లాభం గాని గౌరవం కాని లేదు" వాడి మనసు బిగ్గరగా అరుస్తోంది.

'వంటింటి వైపు మూతి పెట్టిందే ఆ వైపుకి సాగిపోదు కదా! అది కదిలినప్పుడు ఆ వైపు వంటిల్లుందనీ కదిలితే వంటింట్లోకి పోతుందనీ అనిపించలేదా నీకు? ఆ విషయాన్ని పసి గట్టి ముందే ఎందుకు చంపకూడదు? వీలు లేకపోయిందా? కర్ర దొరకలేదా? అక్కడ స్థలం లేదా?"

"పాము అంత టైమ్ ఇవ్వలేద్దొరా?" వాడి పెదవులు మౌనంతో స్తంభించాయి.

"మౌనంతో ఎదురు తిరుగుతున్నావ్‌రా!?" దొర పళ్లు నూరాడు. అతడి మనసు భగ్గుమంటోంది. రామిగాడు



**గుహలు**

"ఈ గుహల్లోని పెయింటింగ్స్ మూడువేల నాలుగు సంవత్సరాల క్రిందట చేసినవి" అన్నాడు వాయు కుమార్.

"అబ్బ... అంత ఖచ్చితంగా ఎలాచెప్పగలిగావ్" ఆశ్చర్యంగా అడిగాడు ఆనందం

"నాలుగేళ్ళ క్రితం నేను గుహలు చూడ్డానికి వచ్చినప్పుడు మూడు వేల సంవత్సరాల క్రిందట అని గైడ్ చెప్పాడు" అన్నాడు వాయుకుమార్.

—కె. వెంకటరామ అక్కయ్య
(కంకిపాడు)

వంటింట్లోకి వెళ్ళి చెట్నీ జాడీలు వగైరాలు తాకినందుకొక వంక భయంతో నైతేనేం? వినయ వాణ్ణి కౌగలించుకున్నందుకొక వంక

కాని అతడీ విషయాన్ని బైటికి చెప్పుకోలేకపోతున్నాడు. ఈ విషయం తమ్ముడికీ, బామ్మర్దికి, మాజీ కరణానికీ, మాజీ రెడ్డికి తెలిసి ఆ తర్వాత వాళ్లలో కొందరు గుసగుసలు పోవడం అతని కిష్టం లేదు.

వూళ్లోని పది మంది బలిష్ఠులైన యువకుల్ని రప్పించాడు.

"వురేయ్... ఈ నా కొడుకుని కట్లు విప్పదియ్యండ్రా..." ఆజ్ఞాపించాడు. రామిగాడు బంధ విముక్తుడయ్యాడు.

ఒకడికి చెవిలో ముందుగా ఏదో చెప్పి పంపించాడు దొరస్వామి. ఆ తరువాత రామిగాణ్ని మింగేసేలా చూశాడు.

"ఇంతవరకూ నేను ప్రశ్న అడిగి జవాబు చెప్పమంటే చెప్పాలి వోర్చుకొమ్మంటే అలా చెయ్యాలి. ఈ ఆనవాయితీకి విరుద్ధంగా నువ్వు ప్రవర్తించావు. దీనికి శిక్ష తప్పదు ఇక్కడి నుండి కాంపౌండు గేటు వరకూ పార్లు దండాలు పెడుతూ వెళ్ళాలి నువ్వు. ఆపక పిక్క బలం చూపాలి. నువ్వు గేటు దాటగానే వీళ్ళు నీ వెంట బడతారు. గూడెం వరకూ తరుముతారు. దొరికావో పిచ్చికుక్కని కొట్టినట్టు కొడతారు. చావు బతుకులు దైవాధీనాలు. అవి నీ పిక్క బలం మీద ఆధారపడి వుంటాయి."

వాడిలోని నిస్సహాయతే తిరగబడి వుంటే ఫలితం మరోలా వుండేది.

వాడిలోని రక్తం మరిగే వుండి వుంటే ఫలితం మరోలా వుండేది.

వాడిలోని సహనమే చచ్చి వుంటే ఫలితం మరోలా వుండేది.

కాని అలా జరగలేదు.

వాడి హృదయంలో ఝంఝుమం రగుల్కోలేదు.

తమోఘ్నుడు తపనుణ్ని కూడా తనలో కలుపుకుని ప్రకృతి నలముకొని వున్న ఆ సమయంలో రామిగాడు అర్ధ నగ్నంగా పార్లు దండాలు పెడుతోంటే అక్కడున్న అంత మందిలోను వాడి పట్ల సానుభూతి సూచికగా ఒకే వ్యక్తి కళ్ళ నుండి రెండు నీటి బిందువులు రాలి తగరు రేకు ధాటికి తాళలేక వెంటనే ఆవిరైపోయాయి.

ఆ వ్యక్తి వినయ.

రామిగాడు ఎప్పుడెప్పుడు కాంపౌండు గేటు దాటుతాడో అని ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు వూరి యువకులు. వీళ్లు వచ్చి తక్కువ కూలీకి పని చేస్తూ తమ కడుపుల కొడుతున్నారని వాళ్ళకి మంట.

సరిగ్గా. ఇదే సమయంలో గూడెంలో దండోరా ఇలా మోగుతోంది.

"గూడె పోళ్ళందరికీ ఎచ్చరిక! అరిజన పెదరాముడనబడే మాదిగ రామిగాడు ఇయాల దొరగారింట్లో పెద్ద తప్పు పని చేసిండు. ఆడికి శిచ్చగా గూడెం పొల్లైవరూ ఆణ్ణియాల ఇంట్లోకి రానిచ్చుకోగూడదు. బువ్వెట్టకూడదు. మంచినీళ్లు గూడ పొయ్యగూడదు. ఇది దొరగోరి ఆగిన!

ఇనుకో వోల్లందరికీ ఇదే గతి పడుతుందహో

ఈ మాటలు పలుకుతున్నప్పుడు తలారి కంఠం వణికింది.

కారణం వాడు హరిజన వెంకన్న అనబడే మాదిగెంకడు.

ఇక్కడ రామిగాడు పరుగు లకించుకున్నాడు.. కాంపౌండు గేటు దాటి.

* * *

వాళ్ళ వాళ్ళ ఇళ్ల ముందర భార్యా పిల్లల్తో నిలబడ్డ వాళ్ళంతా ఒక్క సారిగా కూడ బలుక్కున్నట్టుగా లోపలికి పరిగెత్తి తలుపులు మూసుకోవడంతో రామిగాడికి నెమ్మదిగా పరిస్థితి అర్థమైంది.

వీపు బొబ్బలెక్కి మండుతోంది. పెదాలెండిపోయి పాక్కులు కదుతున్నాయి. శరీరం తూలిపోతోంది.

గుక్కెడు మంచినీళ్లు కూడా తనకి దొరకవని వాడికి బోధపడిపోయింది. ఇది దొరగారు విధించిన శిక్షలో రెండవ భాగమని వాడు ఇప్పటికి గ్రహించాడు.

పాకుతూ దేకుతూ తన గుడిసె వైపుకి యాత్ర సాగించాడు.

* * *

ఫెటేల్మన్న శబ్దంతో బాటుముట్టి పెడత పగిలి నీళ్ళన్నీ నెల్లా చెదరెయ్యాయి.

సుంకులమ్మ నోట మాటరాలేదు.

శబ్దానికి ఏడు మాసాల పసికందు వులిక్కి పడి నిద్ర లేచి ఏడుపు ప్రారంభించాడు.

వికటంగా నవ్వాడతడు.

"నువ్విట్లాంటి పని చేస్తావనే దొర నన్నిక్కడుండమనిండే గూడె పోల్లందరూ నీల్లియ్యకూడదంటే ఇనుకోలేదూ చెవుల్లో శెట్టు మొల్చినాయ్యా?"

"అన్నా!" సుంకులమ్మ కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"అమ్మగాని అబ్బగాని పెండ్లాంగాని ఎవురేగాని ఆడికి నీల్లియ్యడానికీల్లేదు. ఇందుకు శిచ్చయ్యమన్నాడు దొర." అంటూనే వెళ్ళాడతడు నేరుగా ఇంట్లోకి. రెండు కుండల్ని పసిగట్టి వాటిపై బలం చూపించాడు.

రామిగాడి ఇంట్లో వున్న నీళ్ల ఆఖరు

## మచ్చలు మాయం



మీ బట్టలమీద కాఫీ గానీ టీ గానీ పడి మరకలు పోవటం లేదా? ఆ మరకల్ని సబ్బుతో కడిగి ఆ ప్రాంతాన్ని ముందు గ్లిజరిన్‌లోనూ తర్వాత ఉప్పు ద్రావణంలోనూ ముంచండి మచ్చలు పూర్తిగా పోతాయి.

రక్తం మరకలు పోవాలంటే మచ్చ ఉన్న ప్రాంతాన్ని ముందు హైడ్రోజన్ పెరాక్సయిడ్ ద్రావణంలోనూ, తర్వాత అమ్మోనియా ద్రావణంలోనూ నానవెయ్యండి మీ బట్టల మీద ఉన్న రక్తపుమరకలుపోతాయి.

జూపిటర్

ముక్కతో సహా వేలపాలైపోయాయి.

సుంకులమ్మ కళ్ళలో ఆఖరి అశ్రు బిందువులు కూడా ఆవిరయ్యాయి. అసలు దండోరా విప్పించినప్పట్నుంచీ ఆమె మనసు మనసులో లేదు. అప్పటి కింకా పొయ్యి వెలిగించకపోయి వుండటంతో అసలు వెలిగించలేదు. సెవిమిటికి ఏ క్షణంలో ఏ దశలో చూడాల్సి వస్తుందోనని భయపడుతూ రామిగాడి కోసం అనుక్షణం ఎదురు చూస్తూ కూచుంది. అల్లంత దూరంలో వాడగుపించగానే ఆమెకి దుఃఖం కట్టలు తెంచుకు ప్రవహించింది. ఎదురుపరిగెత్తి వాడి అవతారాన్ని చూసి మరింతగా ఏడుస్తూ వాడితో బాటు గుడిసె గుమ్మంలోనే కూలబడిపోయింది.

ఆ సమయంలో ఆమెకి దొరగారు రూల్సు రూళ్ల కర్రలు ఇవేవీ గుర్తుకు రాలేదు. పరిగెత్తి మట్టి పిడత నిండా మంచినీళ్లు తెచ్చింది. మొదటి చుక్క రామిగాడి గొంతు తడపబోతూండగా—

మట్టి పిడత భళ్లుమన్నది.

దొరగారి మనిషి కళ్ళలో విజయ గర్వం తొణికిసలాడింది. విలాసంగా బీడీ వెలిగించటం కోసం జేబుతడిమాడు చప్పగా నిట్టూర్చాడు. వెళ్ళబోయి ఏదో సందేహం వచ్చి ఆగిపోయాడు. ఆ సందేహం మళ్ళీ అంతలోనే నిర్జీవమైనట్టుంది. ఒక్కసారి ఆమె కేసి చూసి బీడి కొట్టు కేసి నడిచాడు.

ఆ చూపులో 'వుంటే మంచినీళ్లిచ్చుకో...'' అన్న భావన కదలాడింది.

వాడి మీద వాడి భావన మీద లేదు సుంకులమ్మ దృష్టి. ఆమె రామిగాణ్నే చూస్తోంది. ఆ చూపుల్లో ఆందోళన వుంది. ఆవేదన వుంది. ఆర్తి వుంది.

రామిగాడు తరచూ కళ్లు తేలవేస్తున్నాడు. వాడి ఒళ్లు సలసలా కాలిపోతోంది. పెదవులు అట్టల్లా మారిపోయాయి. అప్పుడప్పుడూ వెక్కిళ్లు వస్తున్నాయి. నాలిక తోలు ముక్కలా మారిపోయింది.

పసివాడు కేర్ మంటూనే వున్నాడు. హఠాత్తుగా సుంకులమ్మకో ఆలోచన మెరిసింది. అది రాగానే ఆమె వులిక్కి పడింది. వచ్చినందుక్కాదు. ఇంత సేపు రానందుకు.

మరుక్షణం ఆమె రవిక గుండీలు ఫట్ మన్న శబ్దంతో తెగిపోయాయి.

అమృత భాండాలు పులకితలయ్యాయి.

ఏ తనువునైతే ఆడి మగాడికి కర్పిస్తుందో ఆ తనువు తనలో తయారైన అమృతాన్ని తన దేవుడి ప్రాణం నిలవడానికి ధారవోస్తోన్న పవిత్ర క్షణాలవి.

తుంబర నారదులు సైతం ఆ సన్నివేశాన్ని చూసి భక్తి నమ్రులై అమరగానం చేసేవేళ అది.

కచ్ఛిపి కూడా నేను మాత్రం తక్కువా అన్నట్టు గీర్వాణి అనుమతి సైతం కోరకుండా అత్యంత పరవశయై కర్ణ పేయంగా సరిగమలు పలికే వేళ అది.

ప్రకృతే పులకించే వేళ అది. పంచ భూతాలు కీర్తించే వేళ అది.

ఆ ప్రాంతాల్లోని చెట్లూ గట్టూ కూడా

అమర కంఠాన్ని అరువు తెచ్చుకుని స్త్రీత్వంలోని మాతృత్వానికి నీరాజనాలు పట్టే వేళ అది.

ఇగిరిపోని గంధాన్ని పూస్తూ వింజామరలు వీస్తోన్న వేళ అది.

సుంకులమ్మలో అమ్మను చూస్తూ ఆత్రంగా ప్రాణం పోసుకుంటున్నాడు రామిగాడు.

* * *

"నీల్లేదు" గట్టిగా అర్చాడు దొరస్వామి.

చిద్విలాసంగా నవ్వాడు మాజీ కరణం. "అయ్యా! అప్పుడప్పుడూ..."

"నోర్ముయ్... వాడు వాడి శిక్ష తప్పకుండా అనుభవించాలి. వాడి భార్యే కాదు దేవుడే దిగి వచ్చినా నేను వినుకునేది లేదు . నువ్వెళ్లు.." వినయ రామిగాడి కౌగిట్లో వున్న దృశ్యం దొరస్వామి కళ్ళ ముందు నుండి ఇంకా చెదిరిపోలేదు.

"నేను చెప్పేది వినండి పూర్తిగా..."

"వినను వినదల్చుకోలేదు. దయ దాక్షిణ్యం, సత్యం, ధర్మం లాంటివి నాకు లేవు..."


"క్షమించండి అవి మీకు లేవని నాకు తెల్సు అయినా అవసరం వస్తే వాటిని అప్పుతెచ్చుకోవాలి రామిగాణ్ని కనికరించమని వచ్చిన మనిషిని మీరుకళ్ళారా చూస్తే అమ్మో రామిగాడికి ఇంత అందమైన పెళ్ళామా అని బుగ్గలు నొక్కుకోక మానరు..."

దొరస్వామి మాజీ కరణాన్ని చూశాడు. మాజీ కరణం దొరస్వామిని చూశాడు. నాలుక్కళ్లూ కలుసుకున్నాయి.

పావు గంటయ్యాక దొరగారు నడవాలోకొచ్చారు ఠీవీగా నడుస్తూ. లిరిల్ సోపు తాజా పరిమళం అతని శరీరం నుండి గుప్పుమంటోంది.

అమాంతం దొరగారి కాళ్ల మీద పడిపోయింది సుంకులమ్మ.

"మొగుణ్ని విడిపించమని అదేలే ఈ శిక్ష నుండి అడగడానికి కొచ్చావా?"



అవునన్నట్టు తలూపింది సుంకులమ్మ. మాట్లాడ్డం ఇష్టం లేక కాదు. మాటలు రాక.

"అందుకెంత కష్టమైనా భరించగలవా?"

"ప్రాణమైనా ఇచ్చేత్తాను. కనికరం సూపు దొరా" వెక్కిళ్ళ మధ్య అంది సుంకులమ్మ.

"చేదు సబ్బుతో వొళ్ళు రుద్దుకుని వేణ్ణీళ్ళ స్నానం చెయ్యగలవా?" అవును మరి తప్పును బట్టి కాదు వ్యక్తిని బట్టి శిక్ష.

"సలసలగాలినా సేత్తాను.."

"ఒళ్ళంతా ముళ్ళలా గుచ్చుకునే చీర కట్టుకుంటావా?"

"ఓహో! డిస్కో చీర, పెద్దబల్లాపురం చీరో కాబోలు—"

"ముళ్ళేసిచ్చినా కట్టుకుంటా దొరా!"

"రెండు గంటల పాటు ఏ పని చెప్పినా చేస్తావా?"

విష్ణుందేహంగా సిగ్నల్ కోసమే!

"నాలికతో నేల తుడవమన్నా తుడిశేత్త దొరా!"

"మాట తప్పితే?"

"నన్ను శిరెయ్యండి దొరా!"

"సరే" అన్నాడు దొరస్వామి పడక గది శుభ్రం చెయ్యమని పనిమనిషిని పురమాయించటం కోసం వెదుకుతూ

హఠాత్తుగా మాజీ కరణం ఇంట్లో పేరంటం వొచ్చి పడింది. సాయంత్రం వరకూ రావడానికి వీల్లేకుండా పనయ అక్కడికి పంపబడింది.

రామిగాడి కోసం ముంతతో మజ్జిగ తీసుకుని మనిషి వెళ్లాడు.

మెడిమిక్స్ సబ్బుతో సుంకులమ్మ వేణ్ణీళ్ళ స్నానానికి వెళ్ళింది.

దొరస్వామి పడక గది వైపు అడుగులేస్తున్నాడు లొట్టలు వేసుకుంటూ.

సుంకులమ్మ అతనికి లొంగిపోయిందా? ప్రతిఘటించిందా? లొంగిపోయివుంటే, రామిగాడికి తెలిస్తే ఏం చేసేవాడు? ప్రతి ఘటిస్తే సుంకులమ్మ రామిగాడు ఏమయ్యారు?.. లాంటి ప్రశ్నలు అప్రస్తుతం ఎందుకంటే కథ ముగిసిపోతోంది.

ఇక్కడ 'మెలిక' అర్థమయ్యే వుంటుంది. మళ్ళీ వివరించడం ఎందుకు?

*

